సాక్షి నిర్మల్
బుధవారం । 30 । జులై । 2025

'గిరి' సంప్రదాయం

కడెం: గిరిజన సంప్రదాయాలు విభిన్నం ఉంటాయి. అడవి బిడ్డలు నేటికీ వాటిని ఆచరిస్తారు. మంగళవారం నాగుల పంచమి పురస్కరించుకుని మండలంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉయ్యాలలో మానుక పెట్టి అందులో దీపం వెలిగించి నాగదేవతకు ఆరాధన చేశారు. తర్వాత సంప్రదాయ పాటలు పాడుతూ ఉయ్యాల ఊగారు. పాడి, పంటలు, పిల్లాపాపలను చల్లగా చూడాలని నాగుల పంచమి నుంచి ఐదు రోజులు నిత్యం ఇలా పూజలు నిర్వహించి, ఉయ్యాల ఊగుతారు.



ఉయ్యాలలో దీపారాధన చేస్తున్న గిరిజనులు

న్యూస్‌రీల్

వైద్య సేవలు ఎలా ఉన్నాయి

- జిల్లా ఆస్పత్రిని సందర్శించిన టీవీవీపీ కమిషనర్
- రోగుల అభిప్రాయం తెలుసుకున్న అజయ్‌కుమార్



రోగితో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా జనరల్ ఆస్పత్రిని తెలంగాణ వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ మంగళవారం సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చారు. డెంగీతో బాధపడుతున్న రోగులతో మాట్లాడారు. చికిత్స, ఆహారం, మందుల గురించి ఆరా తీశారు. తర్వాత సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 9 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వారికి మెరుగైనచికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. సమీక్షలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, కమిషనర్ సీసీ జితేందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సురేశ్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్‌సింగ్, భైంసా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, సర్సాపూర్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల వివరాలు ప్రదర్శించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

మామడ: ఫర్టిలైజర్ దుకాణాల్లో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలు రైతులకు తెలిసేలా స్టాక్ బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మామడ మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న ఎరువుల వివరాలను కంప్యూటర్‌లో పరిశీలించారు. క్రయ విక్రయాలకు సంబంధించిన రశీదు పుస్తకాలను తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న యూరియా, పురుగు మందుల ధరల వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గుర్తింపు పొందిన సంస్థలు తయారు చేసిన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. రైతులు వేసిన పంటలు, భూసారం ఆధారంగా ఎరువులను ఇవ్వాలని సూచించారు. జిల్లాలో యూరియా కొరత లేదని తెలిపారు.

కడెం గేటు ఎత్తివేత

కడెం: కడెం ప్రాజెక్టుకు మంగళవారం రాత్రి 2,273 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉండడంతో ఒక వరద గేటు ఎత్తి 3,551 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.150 అడుగులు మెయింటేన్ చేస్తున్నారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షుడు



మీనాక్షి నటరాజన్‌ను కలిసిన శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు హైదరాబాదులో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ స్థితిగతులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈనెల 31 నుంచి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 4న ఖానాపూర్ నియోజకవర్గానికి రానున్నారని పేర్కొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు కూడా ఈ సమావేశంలో ఉన్నారు.

నిర్మల్ శివారులో చిరుత

నిర్మల్‌టౌన్: పట్టణంలోని స్టార్ ఫంక్షనల్ నుంచి బంగల్‌పేట్ వెళ్లే మార్గంలో గుట్టలవద్ద చిరుత పులిని మంగళవారం అటుగా వెళ్తున్న వారు గమనించారు. చిరుత గుట్టపై వెళ్తున్న దృశ్యాలను ఫోన్‌లలో చిత్రీకరించారు. దీంతో శివారుప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ చిరుతపులి ఏళ్లుగా ఇదే అడవిలో సంచరిస్తోందని ఫారెస్ట్ రేంజ్ అధికారి తెలిపారు.

ప్రచార లోపమే శాపం!

- ఎన్‌ఎఫ్‌బీఎస్‌పై అవగాహన కరువు..
- అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోని వైనం..
- పేదలకు దక్కని ఆర్థిక భరోసా
- స్కీంను పట్టించుకోని అధికారగణం..



ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వాలు పథకాలు ప్రారంభించేది ప్రజల కోసమే. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ పథకాల అమలులో ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిలా ఉండేది అధికారులే. సంక్షేమం ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదే. వాటి గురించి ప్రజలకు తెలియజేయాలి.. అవగాహన కల్పించాలి. కానీ, ఓ కేంద్ర పథకాన్ని ప్రజలకు తెలియజేయడంలో అధికారుల వైఫల్యం.. జిల్లాలోని పేదలకు శాపంగా మారింది. అర్హత ఉన్నా ఆపథకం ద్వారా ఆర్థిక భరోసా పొందలేకపోతున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే.. ఈ పథకం ఉందన్న విషయమే 90 శాతం మందికి తెలియదు. ఆ పథకమే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ (ఎన్‌ఎఫ్‌బీఎస్). తెల్ల రేషన్ కార్డు కలిగిన నిరుపేద కుటుంబ పెద్ద మరణిస్తే, ఆ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం ఈ పథకం కింద కేంద్రం అందిస్తుంది. అయితే, ఈ పథకానికి జిల్లాతోపాటు రాష్ట్రంలో కూడా సరైన ప్రచారం లేదు. దీంతో అర్హులు దీనిని వినియోగించుకోవడం లేదు. నిర్మల్ కలెక్టరేట్‌లో సోమవారం(జులై 28న) నిర్వహించిన ప్రజావాణిలో ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ నాయకులు ఈ సమస్యను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దృష్టికి తీసుకెళ్లారు.

ఖజానాలోనే నిధులు..

కేంద్రం ఏటా 7,794 కుటుంబాలకు సాయం అందించేందుకు రూ.15.58 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో కేవలం వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లాలో అయితే పదుల సంఖ్యలోనే ఉంటున్నాయి. దీంతో నిధులు ఖజానాలోనే మిగిలిపోతున్నాయి. కొన్నేళ్లలో సుమారు 30 వేల కుటుంబాలకు అందాల్సిన నిధులు మిగిలిపోయాయని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల అలసత్వం

రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం గురించి ప్రజల్లో, అధికారుల్లో కూడా తగిన అవగాహన లేకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. జిల్లాలో ఏటా వందలాది నిరుపేద కుటుంబ పెద్దలు మరణిస్తున్నారు. ఈ పథకానికి దరఖాస్తులు మాత్రం పదుల సంఖ్యలోనే వస్తున్నాయి. ఈ పథకం గురించి తెలియక, కర్మకాండలకు కూడా ఇబ్బంది పడే నిరుపేద కుటుంబాలు సాయం పొందలేకపోతున్నాయని కార్మిక సంఘం ప్రతినిధులు తెలిపారు.

పరిష్కారానికి చర్యలు..

సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ చర్యలు మొదలు పెట్టారు. జిల్లా అధికారులతో ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌ఎఫ్‌బీఎస్‌పై ప్రచారం పెంచాలని సూచించారు. 2017 తర్వాత యజమాని మరణించిన కుటుంబాలు ఈ పథకానికి దరఖాస్తు చేయవచ్చు. అదనంగా, కుటుంబ పెద్దగా మహిళ ఉండి ఆమె మరణిస్తే, పిల్లలకు కూడా సాయం అందించేలా పథకం నిబంధనలను సవరించింది కేంద్రం.

దరఖాస్తు ప్రక్రియ ఇలా..

ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం కింద సాయం పొందేందుకు, కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులు, ఫ్యామిలీ సర్టిఫికెట్, భార్య/తల్లి పాస్‌బుక్, మీసేవ కేంద్రం నుంచి అప్లికేషన్ ఫారమ్‌తో దరఖాస్తు చేయాలి. తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించి, మరణం సాధారణమా, ప్రమాదమా, ఆత్మహత్యా అనే వివరాలతో అఫిడవిట్ అందించాలి. తహసీల్దార్, ఆర్డీవో, డీఆర్వో, కలెక్టర్ ధ్రువీకరణ తర్వాత రూ.20 వేలు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయి.

ప్రచారం కల్పించాలి...

రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది కూలీలు, కార్మికులు చనిపోయినప్పుడు ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదు. ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం నిధులు ఉన్నా ప్రజల్లో అవగాహన లేక దరఖాస్తు చేసుకోవడం లేదు. ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉంది. అలా అయితేనే బాధిత కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది.

– స్వదేశ్ పరికిపండ్ల, ఎన్‌ఆర్‌ఐ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యులు, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

రవాణా 'షాక్'

- సర్వీస్ చార్జీలు భారీగా పెంపు
- వాహన యాజమాన్య బదిలీ చార్జి రెట్టింపు
- సోమవారం నుంచే పెంచిన చార్జీలు అమలు
- జిల్లా వాహనదారులపై అదనపు భారం



రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వాహనదారులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రవాణా శాఖ చడీ చప్పుడు లేకుండా వాహనదారులకు షాక్ ఇచ్చింది. భారీగా సర్వీస్ చార్జీలు పెంచింది. పెంచిన చార్జీలను సోమవారం నుంచే వసూలు చేస్తోంది. దీంతో వాహనదారులు ఖంగు తిన్నారు. 2017 తర్వాత మొదటిసారిగా సర్వీస్ చార్జీలు పెంచింది. ముందస్తు ప్రకటన లేకుండానే పెంచిన చార్జీలు వెబ్‌సైట్‌లో అప్‌డేట్ అయ్యాయి. లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ టెస్ట్, వాహన రిజిస్ట్రేషన్, యాజమాన్య బదిలీ వంటి సేవల ఫీజులు గణనీయంగా పెరిగాయి.

రెట్టింపు ఆదాయమే లక్ష్యంగా..

రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ఈ ఫీజు సవరణ చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని చించోలి(బి) సమీపంలోని ఆర్టీఏ కార్యాలయంలో రోజువారీ 70 డ్రైవింగ్ లైసెన్స్‌లు, 60 వరకు కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్ల జారీ జరుగుతాయి. సుమారు 150 వాహనాలకు సంబంధించిన లావాదేవీలు జరుగుతాయి. కొత్త చార్జీలతో ఈ లావాదేవీల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

అమల్లోకి పెరిగిన చార్జీలు..



పెంచిన సర్వీస్ చార్జీలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. 2017 తర్వాత ఇప్పుడు పెంచడం జరిగింది. అన్ని రకాల రిజిస్ట్రేషన్స్‌తోపాటు లైసెన్స్, పర్మిట్, ఫిట్‌నెస్ అన్నింటిపై చార్జీలు పెరిగాయి. వాహనదారులు పెరిగిన సర్వీస్ చార్జీల ప్రకారం రవాణా సేవలు పొందాల్సి ఉంటుంది. – పి.దుర్గాప్రసాద్, ఆర్టీవో, నిర్మల్

సవరించిన చార్జీలు ఇవీ..

- ద్విచక్ర వాహనం లెర్నింగ్ లైసెన్స్: రూ.335 నుంచి రూ.440కి పెరిగింది.
- ఫోర్ వీల్ లెర్నింగ్ లైసెన్స్: రూ.450 నుంచి రూ.585కి..
- పర్మనెంట్ లైసెన్స్ డ్రైవింగ్ టెస్ట్: రూ.1,035 నుంచి రూ.1,135కి..
- వాహన యాజమాన్య బదిలీ: రూ.935 నుంచి రూ.1,805కి..
- హైపోథికేషన్ ఫీజు : రూ.2,135 నుంచి రూ.3,135కి...
- రుణ బదిలీ ఫీజు: రూ.2,445 నుంచి రూ.2,985కి..
- ఆటోరిక్షా డ్రైవింగ్ టెస్ట్: రూ.800 నుంచి రూ.900కి పెరిగాయి.

ఈ ఛార్జీలు వాహన ధర ఆధారంగా కూడా మారుతాయి. ఖరీదైన వాహనాలకు సేవా రుసుము మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ ఫీజు పెంపుతో వాహనదారులపై అదనపు భారం పడింది. ఎలక్ట్రిక్ వాహనాలకు 100% రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తున్నప్పటికీ, సాధారణ వాహనదారులపై చార్జీలు గణనీయంగా పెంచింది. ఆర్టీఏ కార్యాలయాల్లో సౌకర్యాల కొరత ఆందోళన కలిగిస్తోంది.

కొత్త రేషన్ కార్డులతో పేదలకు సంక్షేమం

- కలెక్టర్ అభిలాష అభినవ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మామడలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మామడ/సోన్: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ కార్డులతో పేదలకు సంక్షేమ పథకాలు చేరువవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్, బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మామడ, సోన్ మండల కేంద్రాల్లో ఆయా మండలాల లబ్ధిదారులకు మంగళవారం రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలాకాలం తర్వాత రేషన్ కార్డులు పంపిణీ చేయడం సంతోషకరమైన విషయమన్నారు. వచ్చే నెల నుంచి నూతన రేషన్‌కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలన్నారు. మామడ మండలానికి 660, సోన్ మండలానికి 863 రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు, ఆరోగ్యశ్రీ సేవలను నూతన రేషన్ కార్డుదారులకు అందుబాటులోకి తేవాలని కోరారు. పేద ప్రజలకు రేషన్ బియ్యం అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. సోన్‌కు చెందిన గనాయి నర్సింహులు ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, పౌర సరాఫరాల అధికారి రాజేందర్, ఆర్డీవో రత్న కళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డీఈఓ తుకారం, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సురేశ్, నిర్మల్ మార్కెట్ చైర్మన్ భీంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే ధ్యేయం

- ఎస్పీ జానకీషర్మిల



కడెం ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

కడెం: ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం పని చేయాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. కడెం ప్రాజెక్టును మంగళవారం పరిశీలించారు. నీటిమట్టం లోతట్టు ప్రాంతాల వివరాలను తెలుసుకున్నారు. విపత్తు వేళలో తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. భారీ వర్షాలు, వరదలు ఉంటే ప్రజలు పోలీసుల సాయం తీసుకోవాలన్నారు. కడెం ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా, జిల్లా పోలీసు కంట్రోల్ రూం నంబర్ 8712659555కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంతకుముందు కడెం ఠాణాను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. గంజాయి నిర్మూలనపై దృష్టి సారించాలని, నేరాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి ఎస్సై పి.సాయికిరణ్, సిబ్బందిని అభినందించారు.

నేడు భైంసాలో పోలీస్ ప్రజావాణి

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజావాణి నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్పీ జానకీషర్మిల కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. అర్జీదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తారు. భైంసా డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

'మధ్యాహ్నం' వంటకు ఎల్‌పీజీ

- సిలిండర్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం
- తొలగిపోనున్న కట్టెల పొయ్యి కష్టం
- జిల్లాలో 830 ఏజెన్సీలు

జిల్లా సమాచారం....

ప్రాథమిక పాఠశాలలు	577
ప్రాథమికోన్నత పాఠశాలలు	89
ఉన్నత పాఠశాలలు	164
మొత్తం పాఠశాలలు	830
మొత్తం ఏజెన్సీలు	830
ఎల్పీజీ కనెక్షన్ ఉన్న పాఠశాలలు	365
ఎల్పీజీ కనెక్షన్ లేని పాఠశాలలు	465



నిర్మల్ పట్టణంలోని ఓ పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న ఏజెన్సీ సిబ్బంది

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్కార్ చర్యలు చేపడుతోంది. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, రెండు జతల యూనిఫామ్‌లు అందించింది. మధ్యాహ్న భోజన చార్జీలు పెంచింది. వంట తయారీకి కొత్త పాత్రలు అందించింది. ఇదే సమయంలో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ ఇబ్బంది పడుతున్న ఏజెన్సీల కష్టాలు తొలగించాలని నిర్ణయించింది. మధ్యాహ్న భోజనం తయారు చేసే ఏజెన్సీలకు ఎల్పీజీ సిలిండర్లను అందించాలని నిర్ణయించింది. దీంతో కట్టెల పొయ్యి కష్టాలు తీరనున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఎల్పీజీ సిలిండర్లు లేని పాఠశాలలను గుర్తించారు. త్వరలో అన్ని పాఠశాలలకు ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది.

జిల్లాలో ఇలా..

నిర్మల్ జిల్లాలో 577 ప్రాథమిక, 89 ప్రాథమికోన్నత, 164 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 830 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. వీటిలో 365 పాఠశాలల్లో ఇప్పటికే ఎల్పీజీ కనెక్షన్లు ఉండగా, మిగిలిన 465 పాఠశాలలకు సిలిండర్లు అందించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆగస్టు 15 నాటికి సిలిండర్లు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పొగ, ఇబ్బందుల నుంచి ఉపశమనం

కట్టెల పొయ్యిలపై వంట చేయడానికి వర్షాకాలంలో వంట కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగతో విద్యార్థులకు కూడా అసౌకర్యం కలుగుతోంది. ఎల్పీజీ సిలిండర్ల పంపిణీతో ఈ సమస్యలు తొలగనున్నాయి. వంట ప్రక్రియ సులభతరం కానుంది. కార్మికులు, విద్యార్థుల ఆరోగ్యానికి దోహదపడుతుంది.

పొగ ఇబ్బంది పోతది



ఏళ్లుగా కట్టెల పొయ్యిపై పిల్లలకు వంట చేస్తున్నాం. వంట సమయంలో పొగ రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పిల్లలు కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పొగ ఇబ్బంది పోతది.
– పోసవ్వ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, లక్ష్మణచాంద

ఉచితంగా ఇవ్వాలి..



గతంలో వంట చేయడానికి అవసరమైన వంట పాత్రలు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చింది. అదేవిధంగా సిలిండర్లు కూడా నెలనెలా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి. దీంతో ఏజెన్సీలపై భారం తగ్గుతుంది.
– రాధిక, మధ్యాహ్న భోజన కార్మికురాలు, మాచాపూర్

ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా..



ప్రభుత్వం సూచనల మేరకు చర్యలు చేపడుతున్నాం. ఇదివరకే జిల్లాలో ఎల్పీజీ కనెక్షన్ లేని పాఠశాలలకు కనెక్షన్ ఇవ్వాలని ప్రతిపాదనలు పంపాం. అన్ని పాఠశాలల్లో సిలిండర్లపైనే వంట చేసి విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలి. – రామారావు, డీఈవో

చిట్యాల వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మహిళల పూజలు..



వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాగదేవతకు పూజలు చేస్తున్న మహిళలు



పాలుపోసి.. పూజచేసి..

శ్రావణ పంచమిని నాగుల పంచమిగా జరుపుకోవడం ఆనవాయితీ. మంగళవారం నాగ పంచమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళలు పుట్టల్లో పాలుపోసి.. నాగమ్మకు పూజలు చేశారు. ఉదయం నుంచే ఆలయాల ఆవరణలోని పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. పాముకు పాలు పోసి.. నాగ దేవతలకు నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, బ్రహ్మంగారి ఆలయం, ట్యాంక్ బండ్ సమీపంలోని పుట్ట, ప్రియదర్శినగర్‌లోని పుట్టల వద్దకు భక్తులు భారీగా తరలివచ్చారు. – నిర్మల్‌టౌన్



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది

పులుల రక్షణతో జీవ వైవిధ్యం

నిర్మల్‌టౌన్: పులుల రక్షణతోనే పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్యం సాధ్యమని నిర్మల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామకృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సేవ్ టైగర్, సేవ్ వైల్డ్ లైఫ్ అనే ప్లకార్డులతో పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ప్రకృతి పరిరక్షణలో పులులు కీలకమన్నారు. అనంతరం పులుల సంరక్షణ, అడవుల రక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో, ఏవో, డిప్యూటీ రేంజర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోర్టులో లొంగిపోయిన నిందితుడు

ఆదిలాబాద్‌టౌన్: ఎగ్జిబిషన్ యజమానిని బెదిరించిన ప్రధాన నిందితుడు రోహిత్ షిండే మంగళవారం ఆదిలాబాద్ కోర్టులో లొంగిపోయాడు. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎగ్జిబిషన్ యజమాని నుంచి డబ్బులు వసూలు చేసిన కేసులో రోహిత్ షిండేపై కేసు నమోదైంది. ఈ మేరకు అతడు లొంగిపోగా కోర్టు 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా జైలుకు తరలించారు. నిందితుడిపై నేరడిగొండ, తాంసి ఠాణాల్లో పలు కేసులు నమోదైనట్లు సీఐ పేర్కొన్నారు.

ఒకరిపై చీటింగ్ కేసు

ఇచ్చోడ: మండల కేంద్రంలో డెయిరీఫామ్ నిర్వహిస్తున్న చెన్నవార్ అభిషేక్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అక్కెనపెల్లి రాజు వద్ద రూ.4.50 లక్షలు అప్పు తీసుకుని అభిషేక్ పరారీ కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అభిషేక్ మరి కొందరి వద్ద రూ.33 లక్షల వరకు అప్పులు తీసుకున్నట్లు తెలిపారు. అతడి చేతిలో మోసపోయిన బాధితులుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

బావిలో పడిన కుక్కను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది


వలతో కుక్కను తీస్తున్న సిబ్బంది, యువకులు

కాసిపేట: మండలంలోని కోమటిచేనులో బావిలో పడిన కుక్కను మంగళవారం అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. నాలుగురోజుల క్రితం కాసిపేట-2 ఇంక్లైన్ గనికి వెళ్లే దారిలోని పాడుబడిన బావిలో కుక్క ప్రమాదవశాత్తు పడిపోయింది. కుక్కను చూసిన స్థానిక యువకులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్‌తో వచ్చిన సిబ్బంది వల సాయంతో కుక్కను బయటకు తీశారు. ఫైర్ ఎస్‌ఎఫ్‌వో సత్యనారాయణ, లీడింగ్ ఫైర్‌మన్ రవికుమార్, డీవోపీ ప్రభాకర్, ఫైర్‌మన్ వేణుగోపాల్, స్థానిక యువకులు పాల్గొన్నారు.

12 టీఎంసీలకు చేరువలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్


జలకళ సంతరించుకున్న ప్రాజెక్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 12 టీఎంసీల నీటి మట్టానికి చేరువలో ఉంది. ఐదురోజుల్లోనే ఏకంగా ఐదు టీఎంసీల నీటిమట్టం పెరిగింది. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి (శ్రీపాదసాగర్) ప్రాజెక్ట్ నీటి మట్టం వివరాలిలా ఉన్నాయి. 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా, 144 మీటర్లకు చేరింది. 20.175 టీఎంసీలకు 11.500 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 440 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ సుజల స్రవంతి పథకానికి 319 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు తరులుతోంది.

‘మధ్యాహ్నం’ ఎప్పుడో!

- అవస్థల్లో ఇంటర్ విద్యార్థులు
- అల్పాహారం తిని కాలేజీలకు..
- ఖాళీ కడుపుతో తిరిగి ఇళ్లకు..
- అర్ధాకలితో అలమటిస్తున్న వైనం


చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు (ఫైల్)

చెన్నూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం లేదు. దీంతో గ్రామీణ విద్యార్థులు అర్ధాకలితో చదువులు కొనసాగిస్తున్నారు. జిల్లాలో వేలాదిమంది గ్రామీణ విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తూ నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం అల్పాహారం తీసుకుని ఇంటి నుంచి కళాశాలలకు వస్తున్న విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లే సరికి సాయంత్రం 6గంటలవుతోంది. అప్పటివరకు భోజనం లేక నీరసించి పోతున్నారు. ప్రతీ కళాశాలలో 100-200 మందికి పైగా విద్యార్థులుండగా హాజరు శాతం అంతంత మాత్రంగా ఉంటోందని అధ్యాపకులు చెబుతున్నారు. ఇందులో గ్రామీణ విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు.

జిల్లాల వారీగా ప్రభుత్వ కళాశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	కళాశాలలు	ప్రథమ	ద్వితీయ	మొత్తం
మంచిర్యాల	10	2,160	1,850	4,010
ఆదిలాబాద్	13	3,100	3,506	6,606
నిర్మల్	15	2,517	2,469	4,977
కు.ఆసిఫాబాద్	11	1,645	2,535	4,180

గతంలో దాతల సాయంతో..

మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో 2015 నుంచి 2017 వరకు అప్పటి ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, 2019లో అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించి గ్రామీణ ఇంటర్ విద్యార్థుల ఆకలి తీర్చారు. కరోనా వచ్చిన తర్వాత ఈ కార్యక్రమం నిలిచిపోయింది. గత ఎమ్మెల్యేల మాదిరిగా దాతలు ముందుకువచ్చి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇంటికి వెళ్లేసరికి రాత్రవుతోంది


మాది చెన్నూర్ మండలం చింతలపల్లి గ్రామం. ఉదయం టిఫిన్ తిని కళాశాలకు వచ్చి ఇంటికి తిరిగి వెళ్లేసరికి రాత్రి అవుతోంది. మధ్యాహ్నం భోజనం లేదు. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే బాగుంటుంది. – సాయిరాం, విద్యార్థి

ఇప్పటికైనా అమలు చేయాలి


మాది భీమారం మండలం ముల్కలపేట. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ, ఆచరణలో పెట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి. – మెసినేని సౌజన్య, విద్యార్థిని

దాతలు ముందుకురావాలి


ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసే వరకు దాతలు ముందుకు వస్తే బాగుంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలో అర్ధాకలితో అలమటిస్తున్నాం. చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాం. – విఘ్నేశ్వర్, విద్యార్థి

‘నాగోబా’కు నీరా‘జనం’


నాగోబా దర్శనం కోసం ఆలయం ఎదుట క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

ఇంద్రవెల్లి: నాగుల పంచమి సందర్భంగా ఆదివాసీ ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయం మంగళవారం భక్తజన సంద్రమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీసంఖ్యలో భక్తులు వచ్చి గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుని నాగోబాను దర్శించుకున్నారు. ఆదిలాబాద్ మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావ్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మెస్రం వంశీయులు అతడిని శాలువాలతో సన్మానించారు. మెస్రం వంశీయులు భక్తులకు జొన్న గట్కాతో కూడిన ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో వెలిసిన దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణంలో శ్రీనాగోబా యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశీయులు మెస్రం కోసేరావ్, నాగ్‌నాథ్, మెస్రం శేఖర్ బాబు, దేవ్‌రావ్, వంశ పెద్దలు మెస్రం బాదిరావ్, ఆనంద్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.


సోయం బాపూరావ్‌తో మెస్రం వంశీయులు


మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


నాగోబా విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

నకిలీ ఆయుర్వేదిక్ అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

- ఎనిమిదిమంది నిందితుల అరెస్ట్
- ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- 15 సెల్‌ఫోన్లు, మందులు కూడా..
- వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ ఆయుర్వేదిక్ వైద్యంతో మోసగిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. ఆరు ద్విచక్రవాహనాలు, 15 ఫోన్లు, సిమ్ కార్డులు, నకిలీ ఆయుర్వేదిక్ మందులు, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ ఖాతాలో ఉన్న మరో రూ.23వేల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలో సాయి ఆయుర్వేదిక్ మందుల దుకాణం పేరిట కర్ణాటకకు చెందిన ముఠా సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, సూపర్ మార్కెట్ల వద్ద అనారోగ్యంతో కనిపించిన బాధితుల వివరాలు సేకరిస్తారు. ఇదే సమస్య ఉన్న తమ కుటుంబీకులను ఆయుర్వేద బాబాకు చూపిస్తే నయమైనట్లు నమ్మిస్తారు. వారి సెల్ నంబర్ సేకరించి ప్రధాన నిందితుడు కుమార్ బాబాకు ఇస్తారు. బాబా సాయంత్రం వారికి ఫోన్ చేసి సమస్యకు తన వద్ద పరిష్కారం ఉందని నమ్మిస్తాడు. ముఠాలోని ఓ సభ్యుడిని వారింటికి పంపించి వారిని ఆయుర్వేద దుకాణానికి రప్పిస్తాడు. 5 గ్రాములు, 10 గ్రాముల నకిలీ మూలికలు ఇచ్చి రూ.5వేల నుంచి రూ.10వేల చొప్పున వసూలు చేస్తాడు. జిల్లా పోలీసులు వారి అక్రమాలను బట్టబయలు చేశారు. వీరిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో-6, టూటౌన్‌లో-1, మావల పోలీస్‌స్టేషన్‌లో-2 కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల్లో కర్ణాటకకు చెందిన కుమార్ పరారీలో ఉండగా, గాజీపూర్‌కు చెందిన శేఖర్ రెడ్‌లైన్, ఉగర్‌ఖర్ద్‌కు చెందిన పెంద్రేకుమార్, దరావడ్‌కు చెందిన గోలార్ సంతోష్, గుల్బర్గాకు చెందిన కొడంగల్ అమ్రేశ్, ఉబ్లికి చెందిన గోలార్ ఆనంద్, గోగక్‌కు చెందిన యలిగర్ హజ్రత్, గుల్బర్గాకు చెందిన నగేశ్, అనిల్‌కుమార్ ఉన్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేటలో ఒకరి నుంచి రూ.7లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రజలు గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే వైద్యం చేసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్, మావల సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్‌రావు, స్వామి ఉన్నారు.

- మైనర్ మ్యారేజీల నియంత్రణకు చర్యలు
- ‘బాల్య వివాహాల ముక్త్ భారత్’తో అడ్డుకట్ట వేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఆసిఫాబాద్ జిల్లాలో ప్రత్యేక కార్యక్రమం

పెళ్లి వద్దు.. చదువే ముందు


బెజ్జూర్‌లో బాల్యవివాహం అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాలో అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాల వివరాలు

సంవత్సరం	అడ్డుకున్న కేసులు
2019	38
2020	29
2021	24
2022	23
2023	18
2024	15
2025	06
మొత్తం	153



ఆసిఫాబాద్: జిల్లాలో తరచూ బాల్యవివాహాలు జరుగుతున్నాయి. నియంత్రణకు ప్రభుత్వం పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఫలితం కానరావడంలేదు. నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటుతనం, ఆడ పిల్లలకు అభద్రత భావం, పేదరికం, సామాజిక దురాచారాలు, కట్టుబాట్ల కారణంగానే బాల్య వివాహాలు కొనసాగుతున్నాయి. వీటి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఓ కార్యాచరణ రూపొందించింది. 2030 నాటికి బాల్యవివాహాల ముక్త్ భారత్ లక్ష్యంతో ముందుకువెళ్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కుమురంభీం ఆసిఫాబాద్‌తోపాటు ఖమ్మం, భూపాల్‌పెల్లి జిల్లాలను ఎంపిక చేసింది.

ఏడేళ్లలో 153 వివాహాల అడ్డగింత

బాల్యవివాహాల నియంత్రణలో భాగంగా తాజాగా కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పురుషుడి వివాహ వయస్సు 21, స్త్రీల వివాహ వయస్సు 18 ఏళ్లు తప్పనిసరి. బాల్య వివాహాలపై తరచూ జిల్లా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా గ్రామీణ ప్రజల్లో మార్పు రావడంలేదు. ఏటా జిల్లాలో బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ముందస్తు సమాచారం అందుకుంటున్న జిల్లా బాలల సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో అధికారులు పలు వివాహాలు అడ్డుకున్నారు. గత ఏడేళ్లలో జిల్లా వ్యాప్తంగా 153 బాల్య వివాహాలను అడ్డుకుని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రత్యేక హబ్‌లుగా..

జిల్లాలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్న పది గ్రామాలను ఎంపిక చేసి ప్రత్యేక హబ్‌లుగా తీర్చిదిద్దనున్నారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తద్వారా వీటిని బాల్య వివాహ రహిత గ్రామాలుగా మారుస్తారు. ప్రతీనెల పాఠశాలల్లో డ్రాపౌట్లు, సుదీర్ఘకాలం గైర్హాజరైన బాలికలను గుర్తించి ఆ జాబితాలను అంగన్‌వాడీ టీచర్ జిల్లా బాలల సంరక్షణ యూనిట్లకు పంపిస్తారు. గైర్హాజరుకు కారణాలపై విచారణ జరిపిస్తారు.

పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం


జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే బాల్యవివాహాల సంఖ్య తగ్గింది. నియంత్రణలో భాగంగా గ్రామ, మండల స్థాయి కమిటీలు వేసి పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అక్కడికి వెళ్లి ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాలు నిలిపివేస్తున్నాం. – మహేశ్, జిల్లా బాలల సంరక్షణాధికారి

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో బాల్యవివాహాలను జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అడ్డుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్, గుండి, రెబ్బెన మండలం నారాయణపూర్, వంకులం, పర్శనంబాల, వాంకిడి మండలం ఇందాని, పెంచికల్‌పేట్ మండలం చెడ్వాయి, బారెగూడ, బెజ్జూర్ మండలం నాగుల్‌వాయి, బాబాసాగర్, కర్జెల్లి, కాగజ్‌నగర్ మండలం బట్టుపెల్లి, చింతగూడ, దహెగాం, చీలపెల్లి గ్రామాల్లో బాల్యవివాహాలను అడ్డుకున్నారు. అధికారుల మాటను నిర్లక్ష్యం చేసిన ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.


మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కుభీర్: మండలంలోని రంజని గ్రామానికి చెందిన జాదవ్ సచిన్ (24) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సచిన్ మంగళవారం మద్యం తాగి ఇంటికి రాగా కుటుంబీకులు మందలించారు. దీంతో తాగిన మైకంలో సచిన్ తన వ్యవసాయ చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి చిన్నాన్న శివరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాటోలిలో ఉరేసుకుని ఒకరు..

భైంసారూరల్: మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన బాదోళ్ల మహేశ్ (31) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే మహేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉంది.

జంగుగూడలో మరొకరు..


కృష్ణ మృతదేహం

పెంబి: మద్యం తాగవద్దని భార్య మందలించినందుకు మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని షెట్‌పల్లి పరిధి జంగుగూడ గ్రామానికి చెందిన మోస్రం కృష్ణ (31) మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా తరచూ భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగవద్దని భార్య గీత మందలించగా మనస్తాపానికి గురై సోమవారం రాత్రి 11గంటలకు పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబీకులు ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని ఉరేసుకున్నాడు


నవీన్ మృతదేహం

కెరమెరి(ఆసిఫాబాద్): ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మధూకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవుడ్‌పల్లికి చెందిన జాడి నానాజీ–విమలాబాయి దంపతులకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లున్నారు. వీరిలో చిన్నవాడు నవీన్ (24) ఉన్నత చదువులు చదివాడు. ఇటీవల డీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం రాలేదు. దీంతో రోజూ బెంగపడుతుండేవాడు. ఈక్రమంలో సోమవారం ఇంటినుంచి బయటకువెళ్లిన నవీన్ సాయంత్రమైనా తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబీకులు వెతకగా సమీపంలోని ఓ చెట్టు కింద శవమై కనిపించాడు. అయితే అతడు చెట్టుకు ఉరేసుకోగా తాడు తెగి బండరాళ్లపై పడ్డట్లు ఆనవాళ్లున్నాయని మృతుడి తండ్రి నానాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శాంతిఖని గనిలోకి దిగిన డీఎంఎస్


గనిలో దిగడానికి సిద్ధమైన డీఎంఎస్, జీఎం

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని భూగర్భ గనిని మంగళవారం డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీఎంఎస్) ఎస్.నాగేశ్వరరావు సందర్శించారు. గనిలో దిగి పని స్థలాలు, రక్షణ చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదరహిత సింగరేణి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి యాగంలో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ దేవేందర్, శాంతిఖని గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్ అబ్దుల్ ఖదీర్, బాలాజీ భగవంత్ ఝా, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, రక్షణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ విద్యాసదస్సులో రంగయ్య


ఉత్తమ టీచర్లు, ఇన్నోవేటర్ స్టూడెంట్లతో రంగయ్య

కెరమెరి(ఆసిఫాబాద్): ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన జాతీయ విద్యాసదస్సుల్లో మండలంలోని సావర్‌ఖెడా పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కడెర్ల రంగయ్య పాల్గొన్నారు. అఖిల భారతీయ శిక్షా సమాగం (ఏబీఎస్) ఐదో వార్షికోత్సవం సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఎన్ఈపీ (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ) -2020లో ఎలాంటి మార్పులు జరిగాయి, విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు.. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) గురించి చర్చించినట్లు రంగయ్య తెలిపారు. సదస్సులో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, వివిధ రాష్ట్రాల మంత్రులు, ప్రొఫెసర్లు, తెలంగాణ రాష్ట్రం నుంచి ఏడుగురు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, ఐదుగురు ఇన్నోవేటర్ స్టూడెంట్స్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

జనగణనలో షెడ్యూల్డ్ ట్రైబ్ కాలమ్ పొందుపరచాలి


గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్: 2027లో చేపట్టనున్న జనగణనలో ఆదివాసీలకు సంబంధించి షెడ్యూల్డ్ ట్రైబ్‌గా గుర్తించే ప్రత్యేక కాలమ్ పొందుపరచాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నాయకులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ.. జనగణనలో కాలమ్ పొందుపరిచే అంశాన్ని కేంద్రానికి సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. 50శాతానికి మించి జనాభా ఉన్న ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించాలని కోరారు. ఆదివాసీలకు ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలున్న నేపథ్యంలో షెడ్యూల్ ట్రైబ్ మతంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అనేక సమస్యల నుంచి నాన్ షెడ్యూల్డ్ గ్రామాలుగా ఉన్న కారణంగా ఆదివాసీ గ్రామాలకు ఐటీడీఏ పథకాలు అందడంలేదని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత హక్కులు ఆ ప్రాంతవాసులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీ మీడియం బాబురావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నాయకులు రవికుమార్, శ్రీరామ్, ధర్మ తదితరులున్నారు.

ఎస్సారెస్పీలోకి 65వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మామడ: ఎగువ కురుస్తున్న వర్షాలకు క్రమంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి నిల్వ పెరిగింది. మంగళవారం 65వేల క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నిల్వ 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1,076.60 అడుగులు (36.464 టీఎంసీలు) నీటి నిల్వ ఉంది. దీంతో సరస్వతీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తంజేస్తున్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 29వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఉండగా ఆగస్టు 13వ తేదీ వరకు పొడగించినట్లు కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ రేపాల కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. https://cbseitms. rcil. gov. in/ nvs/ వెబ్‌సైట్ ఓపెన్ చేసి క్యాండిడెట్ కార్నర్‌లో రిజిస్ట్రేషన్ ఫర్ 6వ తరగతి 2026–27ను క్లిక్ చేసి అప్లికేషన్ ఫాం ఫిల్ చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు


ల్యాప్‌టాప్ అందజేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలవాలని సూచించారు. పెంబి మండలం పాశపుల గ్రామానికి చెందిన గుగ్లావత్ వామనరావ్‌కు జేఈఈ మెయిన్స్ పరీక్షల కోసం, ఉట్నూర్ మండలం శంకర్‌తండా గ్రామానికి చెందిన రాథోడ్ మనోజ్‌కు ఐఐటీ చదవుల కోసం వారి తల్లిదండ్రుల సమక్షంలో ల్యాప్‌టాప్‌లు అందజేసినట్లు తెలిపారు. పట్టుదలతో లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.